కుని వుంటావ్. దేవదాసు. దివోదాసు కథలో మాదిరి ఒకదేమో వేశ్యాలోలుడైకూడా భగవంతుని గురించి చింతపడేవాట్ట. రెండో వాడు భగవత్ప్రార్థనలో నిమగ్నమయినట్లే కనిపించినా, మనసులోమాత్రం మొదటివాడి అదృష్టానికి అసూయపడేవాట్ట. దేముడు మొదటివాడ్నే కరుణించాడు" అన్నాను అన్నయ్యని యింకొంచెం వుడికించాలన్నట్లు.

"ఛా". అన్నయ్య మొహం వివర్ణమై పోయింది. నాకు జాలేసింది.

● ● ●

"పోతన భక్తిపరుడని, గుండూ, గిండూతో వర్ణిస్తారుగానీ. అది తప్పు. పోతన ఎంత భక్తిరసంగా రాసినా. అతను చాలా శృంగార ప్రియుడు. శ్రీనాధుడు యెంత శృంగారం రాసినా ఆధ్యాత్మిక చింతన కల వాడు" అంటారు మా తెలుగు మేష్టారొకాయన. ఆ విషయం నాకర్థే తెలీదనుకోండి!

తేనెపూసిన కత్తి. పయోముఖ విష కుంభం. తడిగుడ్డతో గొంతులు కోయటం మొదలయిన మాటలు ఎలా వాడుకలోకి వచ్చాయి? మనసులోమాట బైటికి తెలియక పోవటం, ఆ తర్వాత వాళ్ళు చేసే పన్లు తెలియటంవల్లగదా! అర్ధరాత్రి పన్నెండింటికి వచ్చి తలుపులు కొట్టే అతిధిని చూడగానే "వీడిదుంపతెగా, వీడెందుకు వచ్చాడ్రా నిద్రచెడగొట్టేందుకాకపోతే" అనిపిస్తుంది మనసులో. మనసులో అనుకోగానే, ఆ మాటలబోర్డు మొహంమీదికొచ్చే మిషనేదన్నావుంటే! అమ్మో! ఇంకేవన్నా వుందీ? తెల్లారిలేచింది మొదలు కొని ఎన్ని విసుగులూ, యింట్లో వాళ్ళ మీదా బైటివాళ్ళమీదాకూడా, ఎంతకథా!

అయినా, తప్పుచేసినవాళ్ళ మొహం ఏదో విడిగా వుంటుందనుకోవటం హాస్యాస్పదమే! కనిపించకుండా నిబ్బరం నటించ గలవాళ్ళు వుండవచ్చు. దొంగా! దొరా! అన్నారు. పట్టుబడనంతకాలం దొరేగా దొంగ?

కనుబొమ్మలూ. చెవులూ. ఆడవాళ్ళల్లో మగలక్షణాలు. వాతావరణం, వయస్సూ. వంశం, పెరిగిన పరిసరాలు. రాజకీయాలు. ఆర్థిక బాధలు, సమయాసమయాలు. మత వ్యవస్థా మొదలయిన కారణాలు. నేరస్థులను తయారు చేస్తాయని. నేరం చేసేందుకు దోహదం చేస్తాయనీ అంటారు. వాటిలో కొన్ని నిరాధారమైనవి. ఎవరికన్నా తమని చూస్తే తమకి అసహ్యంవేస్తుందా? ఏదో పత్రికలో కాబోలు ఒక కథ చదివాను. ఒక రాజకుమార్తెని నువ్వు కురూపివని. పదేపదే వేధిస్తూంటుందొక అవ్వ. నిజమే కాబోలని ఆమె మనోవ్యాధిపడుతుంది. ఆమెని ప్రేమించినవాడికి. కాదని నమ్మించట మెలాగో తెలీదు. ఏదో కారణంవల్ల అతని కత్తిలో ఆమె ప్రతిబింబం కనిపించి. ఎంత మురిసిపోతుందనీ?

ఒకసారి క్లాస్ ఫొటో వచ్చింది. అందరూ ఎగబడుతున్నారు మేష్టారు మటుకూ, ఫొటో యివ్వకుండా ఒక్కొక్కళ్ళ మొహాలు పరిశీలిస్తున్నారు.

"మీలో చాలామందిలో, మనమెలా వున్నా మా ఫొటోలో అని కాక వాళ్ళూ, వీళ్ళూ. ఎలా వున్నారో చూద్దామన్న కుతూహలం కనిపిస్తోంది. అది తప్పు. మీ మొహాన్ని మీకు మీరు ప్రేమించాలి. ఆ తర్వాతనేఎవరిదయినా.ఇందు, ఎవరిమొహాలు వాళ్ళు చూసుకోండి" అన్నారు.

ఆయన చెప్పిన అభిప్రాయం అందరికీ సరిపోయినా, సరిపోకపోయినా, నాకు మటుకూ, ఆ క్షణంలో సరిగ్గాసరిపోయింది. ఫొటోకు పోజులివ్వటం చేతయినవాళ్ళూ, "మాది ఫొటో జెనిక్ ఫేస్" అన్నవాళ్ళూ, "వ్వ ఏవిటో. బైముకి తలదించేసేనూ," "ఎలావుంటే ఏం? సినిమాల్లో చేరబోవట్లేదుగా" అనేవాళ్లూ. రకరకాలు. ఒకరనేమిటి? అందుకి అత్రుత ఏమిటో? ఈ సంగతి ఎలా కనుక్కున్నారూ ఆయన? అనుభవం సార్; అనుభవం! □□□

—కె. త్రిపుర.



"సహోసహో భవతి జాయమానః"

"ఆశీర్వచనపు పనస-అమ్మయ్య!" అనుకున్నాడు సుబ్బా

రాయుడు రిక్షాదిగుతూ.

అక్షతలు జల్లి యువతులకు ఎస్తున్న ఒక ముసలాయన పలకరించేడు-

"— ఇప్పుడా రావడం!"

'బండి గంటలేటు'.

ఎరిగినవాళ్ళు యింకో యిద్దరు పలకరించేరు సుబ్బారాయుణ్ణి. ఎరగని వాళ్ళకు పరిచయం చేసేడు ముసలాయన.

"పావన రామయ్య బావమరిది! ఎరుగుదువుకదూ! నీలవేణమ్మకు స్వయానా తమ్ముడు."

సుబ్బారాయుడు సన్నగా పొడుగ్గా తుద వంగిన చెఱుకు గడలా ఉంటాడు. ముతక గుడ్డలు. ముతక మొహం.

సుబ్బారాయుడికి ఎవరో నీళ్ళిచ్చేరు. ఇంకెవరో చేతికి తువ్వాలిచ్చేరు.

"రిక్షావాడికి కూలెంత బావా!" అని పావనరామయ్య పినతల్లి కొడుకడిగేడు.

"అర్ధరూపాయి" అని "నేనిస్తాను" అన్నాడు.

చేతులు తుడుచుకుంటూ సుబ్బారాయుడు లోనికి వెళ్ళేసరికి పావనరామయ్య అప్పుడే పీటలమీంచిలేచి సభకు నమస్కరిస్తున్నాడు. పురోహితుడు తనకి రావల్సినవి నొల్లుకుంటూ "సభాయైనమః" అన్నాడు గొణుగుడుగా.

పావనరామయ్య ఒకచాయ నల్లగా కొంచెం వల్చగా ఉంటాడు. ఎర్రని పాత పట్టు తాపితా కట్టుకున్నాడు. దాని రంగు చాలా వెలిసి తూట్లుపడి ఉన్నది. అతడి జుత్తు చాలావరకూ తెల్లపడింది. అరవయ్యోపడి సమీపించినా అంతకన్నా చిన్నవాడిలా ఉంటాడు.

నీలవేణమ్మ పొట్టిగా కొంచెం స్థూలంగా ఉంటుంది. బావమరిదిని చూసి పావనరామయ్య-

"సుందరం స్టేషన్‌లో కనపళ్ళేదూ?" అన్నాడు.

అది అతడు పలకరించే పద్ధతి.

"రిక్షావాడి కిల్లు గుర్తులు చెప్పి వాదేదో సామాను కొనాలని దిగబడ్డాడు." అప్పగారికేసి చూస్తూ జవాబిచ్చేడు.

"వంట బ్రాహ్మడు గోధుమ్నూక చాల్లేదంటే తెమ్మన్నాను."—నీలవేణమ్మ మాటలో మాట కలిపి వెళ్ళిపోయింది.

పావనరామయ్య సుబ్బారాయుణ్ణి లోపలికి వెళ్ళమని చెప్పి తను వీధిలోకి వెళ్ళేడు.

దిగంతాల మంచు తెరలింకా విడుతూనే ఉన్నాయి. సూర్యోదయమై నిండా ఘడియ ప్రొద్దవుతుంది. ఎదుట దక్షిణ దిశను నగరం ఏటవాలుగా పరుచుకుని ఉన్నది.

"చక్కటి దృశ్యంరా అబ్బీ! ఆ ఎదురుగా వేసిన పునాదులమీద ఇల్లు లేచిపోతే ఏమీలేదు."

కాళీపట్నపు రామారావు



ముసలాయన పావనరామయ్యకు బాబయ్య అవుతాడు. స్కూల్ మేష్టరీ చేసి రిటైర్ అయ్యాడు. ఇప్పటికీ ప్రైవేట్లు చెపుతాడు.

"ఏమున్నది ఇంకో ఆరునెల్లు పోయాక వస్తే యీ యిల్లు యెక్కడని వెతుక్కోవలసిందే."

పావనరామయ్య స్నేహితుడన్నాడు.

"రా! కూర్చో!!" అన్నాడొకతను. మరొకాయన జరిగి చోటిచ్చాడు.

కూర్చుంటూ "ఇంకా ఎవరూ రాలే" దన్నాడు పావన రామయ్య. వాకిట్లోనిలబడి చుట్టలు కాలుస్తున్న వాళ్ళిద్దరూ పై ఊరు నుండి వచ్చిన బంధువులు.

"చలి! అందునా ఇవాళ విపరీతమైన మంచు. సముద్రపొద్దున చలి వెయ్యదంటారు!" వాళ్ళల్లో ఒకడన్నాడు.

పావనరామయ్య ఇంటికి తూర్పునఉన్న పెద్ద డాబా నీడ పెరటికేసి వ్యాపించి ఉండడం చూస్తున్నాడు.

"బాబూ ఇప్పటికి గృహప్రవేశం తంతయ్యింది. ఇంక సత్యనారాయణవ్రతం- వెంకటేశ్వర దీపారాధనా కావాలి. అర గంటలో వర్జంవస్తుంది".

—పురోహితుడు.

పావనరామయ్య లేచి పెరట్లోకివెళ్లాడు. పెరట్లోకూడా చిన్న పందిరిఉన్నది. దానికి తూర్పుకేసి గాడిపొయ్యి ఉన్నది. నలుగురు ఆడవాళ్లు ఎండలోచేరి కబుర్లు చెప్పుకుంటున్నారు. ఇద్దరు ఆడవాళ్ళు వంట బ్రాహ్మడికి చెకచెక కూరలు తరుగుతున్నారు. పిల్లలు కొందరు ఆకలి కేదుస్తున్నారు.

ఒకావిడ తీరిగ్గా బిగించి బిగించి జడవేసుకుంటూంది.

పావన రామయ్య ఆడవాళ్ళను కదిలించడానికి చేసే ప్రయత్నం కలిసి రావడంలేదు. అప్పుడే స్నానం చేసి వస్తున్న సుబ్బారాయుడు "నువ్వువద! నే నన్నీ ఏర్పాటు చేస్తా"నన్నాడు.

## 2

పగలు పదకొండు గంటలవుతుంది. పావన రామయ్యగారిల్లు కిటకిటలాడుతోంది.

శుభకార్యం జరుగుతున్న నట్టింట ఆడవాళ్ళూ పిల్లలూ - కొందరు ముసలివాళ్ళూ- ఇరికిరికి కూర్చున్నారు. వీధి వరండాలో స్నేహితులూ తన బంధువులూ కూర్చున్నారు. చోటు చాలనివాళ్లూ, ఎండకావలసిన వాళ్ళూ కొందరు రోడ్డుమీదా వాకిటా నిల్చుని పొగలు పీలుస్తూ దిక్కులు చూస్తున్నారు. పడమటి గోడనీడను పడుచుపిల్లలు కొందరు మంచాలేసుక్కూర్చుని కబుర్లు చెప్తూ గడబిడ చేస్తూ మిడిసి మిడిసి పడుతున్నారు.

పాత జార్జెట్ చీరలూ అంతకన్నా పాత పట్టుచీరలూ కట్టుకున్న కొందరు ఆడవాళ్ళు పెరటి ఎండలోనుండి ఇంటినీడలోకి నీడలోనుండి ఎండలోకీ తిరుగుతున్నారు. ఒకటి రెండు చీరలప్పు డప్పుడూ పడమటి గోడచుట్టి పీధిలోకి వచ్చి వెనక్కిపోతున్నాయి.

గాడీమీద ఆవిర్లొస్తున్న అండాలు వంట బ్రాహ్మడు దింపుతున్నాడు. దిగిన వేడి వేడి అండాలను యింటిలోకి సాయం పడుతున్నాడు.

ఆ యింటికి పడమటివైపున క్రొత్తగా పడుతున్న పునాదుల వెనుక—వా చ రు పూరిపాక గుమ్మంలో కూర్చున్న ఏడేళ్ళ పిల్లవాడికా యిల్లు చీమలు పట్టిన కలకండ ముక్కలా ఉన్నది. ఆ పునాదుల కెదురుగా ఉన్న మేడమీద ఉన్న ఓ ప ద హా రే ళ్ళ అమ్మాయి యిదంతా తీరిగ్గా చూస్తున్నది. ఆమె కా సీను వాళ్ళ ఆర్టిస్టు బావ రంగులు తుడుచుకునే తెల్లటి పాత షర్టు ముక్కలా గున్నది.

అంతవరకూ అందరికీ అన్నీ అందిస్తూ వచ్చిన సుందరం ఇంతమందికి భోజనాల ఏర్పాటు ఎక్కడ? ఎలా?' అన్న ప్రశ్న ఎదురుపడగా హడావుడిగా మేనమామను వెతుక్కుంటూ బయలుదేరేడు.

అతడు పెరట్లో గాడిపొయ్యి ;ద గ్గ ర దొరకలేదు. వీధిలో జనంమధ్యన ఉన్నా డేమోనని వెళ్ళేడు.

"వీడే"—అన్నాడు తాతగారు.సుందరం నిచ్చెర పోయేడు.

"ఐదుగురు మగపిల్లలకూ దక్కినవాడు వీడొక్కడే ఉన్నాడు. ముగ్గురాడ పిల్లలకూ ఇందాక నాకు మంచినీళ్ళు తెచ్చిపెట్టిన పిల్ల సూర్యమణి ఉన్నది."

అందరిచూపులూ ఒక్కసారి సుందరం వంక తిరిగాయి.

సుందరానికి యిరవై యేళ్ళంటే ఎవరూ నమ్మరు. వాడి ముఖంమీద వున్న పెద్ద పెద్దగంట్లుచూస్తే వా డై నా పొరపాటున బ్రతికిపోయాడని తెలుస్తుంది. ఎటొచ్చీ వాడివి పెద్దపెద్ద కళ్ళు.

అంతమంది ఒక్కసారి తనవంక అలా చూసేసరికి వాడు వచ్చినపని మరిచి వెళ్ళి పోయేడు.

"పెద్దవాడు యిరవైయేళ్ళవాడు. ఫస్టు క్లాసులో డిగ్రీపుచ్చుకున్నాడు. ఉద్యోగంలో చేరి నిండా నెల తిరగలేదు. ఆస్పత్రిలో చేర్చేరు. ఆస్పత్రిలోచేర్చిన పదిహేను రోజులనాడు హరీమనేశాడు. ఆ షాకునుండి తేరుకోకుండానే రెండోదెబ్బ. పద్దెనిమిదేళ్ల పెంచి పెద్దదాన్నిచేసేరు ఆడపిల్లను. వెయ్యి రూపాయిలు క ట్న ం. పదిహేనువందలు యితర ఖర్చులు. కడుపుతోఉంది. ఇవాళో రేపో కంటుంది. మనవడా, మనవరాలా అని ఎదురుచూస్తున్నారు. ఆ పిల్ల అసలుకే మోసంచేసిపోయింది...."

విన్నవాళ్ళు వింటున్నారు. విననివాళ్ళు కొందరింకే వేవో కబుర్లు చెప్పుకుంటు న్నారు. అందరూ తంతు ఎప్పుడు ముగు స్తుందాఅని చూస్తున్నారు.

చివరకు ముగిసింది. పీటలమీంచి లేచిన వాళ్ళతోపాటు తక్కినవాళ్లుకూడా లేచేరు.

కొంతమంది యింటిలోనుండి బయటకు వెళుతున్నారు. మరికొంతమంది బయట నుండి లోనికి వెళుతున్నారు.

ఇల్లు చిన్నదన్నాడు ఒకాయన. చిన్న వీధికొట్టు. అంతకన్నా కొంచెం పెద్దది వరండా. మధ్యను ఒకటే పెద్దగది. గది నానుకొని వరండా, వంటగది ఉన్నవి. ఆ వె ను క తగుమాత్రం పెరడున్నది. ఈశాన్యమూలను లెట్రిన్, వా య వ్య మూలను నూయి.

ఇల్లు బొమ్మరిల్లులా ఉన్నాదన్నాడు ఒకాయన.

ఇల్లు బాగున్నదన్నా డింకొ కాయన.

"నుయ్యి మనదేనా?" అడిగా డెవడో.

"ఉమ్మడి" అన్నాడు ప్రక్కాయన.

"ఎవరు"

"ఈ యిల్లు అమ్మిన వాళ్ళే"

నట్టింట నిలుచుని దానికి సరిపడా ఉన్న ఓ పట్టుచీరావిడ అడుగుతోంది—

"కోడలొస్తే కొడుకూ కోడలూ ఎక్క డుంటారు?"

"పండుక్కి కూతురొస్తే కోడలు వెళు తుంది. ఫరవాలేదు." అనుకుంది ఒక పిల్లల తల్లి.

వీధిలో రోడ్డుమీద నిల్చుని పళ్లు విరుచు కుంటున్న ఆవలింతలు రాయుడు - అంతా అయ్యాక అన్నాడు.

"అన్నీ సరిపెట్టుకోవచ్చుగాని ఒక్కటే యిబ్బంది"

ప్రక్కవాడు ఏమని ప్రశ్నించలేదు.

"చుట్టూ అన్నీ ఎత్తునఉన్న ఇల్లు. ఆడ వాళ్ళు ఏ చిన్నగుడ్డో కట్టుకొని పెరట్లోనైనా తిరగడానికి వీలుండదు.

దీర్ఘదర్శి దీర్ఘదృష్టులను గమనించి విస్తు పోయాడు రెండవవాడు.

వెళ్ళినవాళ్ళు వెళ్ళగా ఉన్నవాళ్ళు భోజ నాలకు లేచేసరికి పన్నెండు దాటింది.

సుబ్బారాయుడు వీ ధి వ రం డా కు దుప్పట్లూ వగైరాలుకట్టి దానినికూడా ఉప యోగంలోకి తెచ్చాడు. మొదటి పంక్తిలో మొగవాళ్ళూ పిల్లలూలేస్తే రెండవ బంతిలో ఆడవాళ్ళు కూర్చున్నారు.

"పిల్ల చామనచాయైనా పెద్దకళ్ళూ కళైన ముఖం. పరిశుభ్రతా మాట మృదువూ-అన్నీ ఉన్నాయి. మరి దీని ఖర్మం ఎలాఉన్నదో."

—అన్నదొకావిడ.

సూర్యమణి సన్నగా సళాకులా దట్టమైన నిడుపాటి కురులతో నీటుగా వోణీ చెంగు మొలను ముడిచి వడ్డిస్తోంది-వరుసలుపెట్టి.

"పిల్లకు పదహారేళ్లు ఉండవూ?" అన్న దొకావిడ.

"ఉండకేం మొన్న పెళ్ళయిన మా చిట్టీ ఇదీ ఒక్కతోటివాళ్ళే."

ఎదుటిపంక్తినుండి జవాబు వచ్చింది.

"ఉండనిస్తూ! ఇప్పుడేం తొందర వచ్చింది?"

ఇంకొకావిడ.

---

● ఆంధ్ర రాజధానిని చూడ్డానికి వెళ్ళిన ఓ పల్లెటూరి ఆసామీ ఒక పెద్ద హోటలుకి వెళ్ళాడు. హోటల్ యజమాని గది అద్దె వివరాలూ అన్నీ చెప్పి "ఉదయం ఐదునుంచి పదకొండువరకు కాఫీ టిఫిన్లు. పదకొండునుంచి రెండు గంటలవరకు భోజనం, మళ్ళీ రెండునుంచి ఆరుగంటలవరకు కాఫీ టిఫిన్లు. రాత్రి పదిన్నవరకు భోజనం సప్లయి చేస్తాము." అని ముగించాడు.

"ఇలా అయితే ఊరుచూడ్డమెప్పుడూ?" అని పల్లెటూరాయన హోట ల్లోంచి పైకి వచ్చేశాడు.

— రమణమూర్తి.

పిల్లల్ని పెట్టుక భోజనాలు కానిస్తున్న ఆ ఆడవాళ్ళలో సూర్యమణి వంక జాలిగా చూసేవారు జాలిగా చూస్తే, ఆశగా చూసేవారు కొందరు ఆశగా చూశారు. ఒకళ్ళిద్దరికి అ పిల్లకూడా తిప్పుకుంటున్నట్టూ విరగబడి పోతున్నట్టూ కనిపించింది.

భోజనాలయ్యాక ఇంటికి తూర్పుకేసి చేరిన నీడను రెండు మంచాలు - మూడు కుర్చీలు వడేసుకొని ఐదుగురు మగవాళ్ళు ఆయాసం తీర్చుకుంటున్నారు.

వాళ్ళల్లో ఇద్దరు నడికారువారు మంచాలెక్కారు. ఒకాయన వెల్లకిలా పరుండి నీలాల నింగికేసి చూస్తున్నాడు. అతడు కలెక్టరాఫీసులో ఏదో సెక్షనులో ఏదో గుమస్తాగా పనిచేస్తున్నాడు. రెండవఆయన ఒక తలగడాకూడా సంపాదించి పట్టెమంచం మీద బోర్లగిలా పడుకొని ఎదురుగా కనిపిస్తున్న గడ్డిమొక్కల్లోకి చూపులు వదలి మనసును ఇంకేదో లోకాల్లో పారాడనిస్తున్నాడు. అతడు జిల్లాకోర్టులో బాగా ప్రాక్టీసుఉన్న లాయరువద్ద చాలాకాలంగా పనిచేస్తూఉన్న ప్లీడరుగుమస్తా.

మడత కుర్చీలో కూర్చున్న మనిషికి ముప్ఫయిఐదేళ్ళుంటాయి. ఒక్కడంటే ఒక్కడే కొడుకు. ఒక్కత్తంటే ఒక్కతే కూతురు. లోకల్ ఎన్. జి. ఓస్ అసోసియేషనుకు శక్రటరీ. కాస్తంత కవి. కొంచెం నటకుడు చాలా భావుకుడు. కండ్లనున్న కండ్లద్దాలలోనుండి ఆ చుట్టువున్న మేడల్ని చూస్తూ వాటిగురించి భావిస్తున్నాడు.

ఎ. పీ. టి. యస్. ఆఫీసు క్లర్కుకి ముప్ఫయియేళ్ళేఉంటాయి. అతడు పేంటు మడతలు నలక్కుండా పొందిగ్గా పేము కుర్చీలో కూర్చున్నాడు. దర్జాగా కాళ్ళు ఊపడం అలవాటు ఇప్పుడు అప్రయత్నంగా కూడా సాగుతూఉన్నది.

చేతుల్లేని కర్రకుర్చీలో యిబ్బందిగా కూర్చున్న అబ్బాయి యీమధ్యనే యూనివర్సిటీ చదువు ముగించి సిండియాలో ఉద్యోగంకూడా చేస్తున్నాడని వినికిడి.

నీలాల నింగికేసి చూస్తున్న పెద్ద గుమస్తా చూసిచూసి అన్నాడు.

"పశువులకూ పక్షులకూ కూడా తమ స్వంత గూడంటూ ఒకటి ఉంటుంది. మనిషి చచ్చిందాకా బ్రతికికూడా గూడు కట్టుకోలేక పోతున్నాడు. దీనికి ఎవరిని ఏమనాలో తెలియడంలేదు" అన్నాడాయన.

ఎవరూ ఏమీ అనలేదు.

"బ్రతుకు బ్రతుకల్లా బ్రతికి కూడబెట్టిందంతా ధారపోస్తేగాని ఒక గూడు రాకపోవడం చాలా అన్యాయం" అన్నాడు ఆయనే. ఈసారి జవాబు వచ్చింది.

"ఎంతయ్యింది ఏమిటి?" అన్నాడు పేముకుర్చీలో ఆయన కాళ్ళూపడం ఆపకుండానే.

"ఆరువేలు!''

ఈసారి కాళ్ళూగడం ఆగిపోయింది.

"ఆరువేలే!!''

ఆ రేటున తాను కట్టదలచిన యింటికి యెంతలేదన్నా పదిహేనువేలుదాకా అయ్యేటట్టుంది. అతడికాళ్ళు మళ్లా ఊగడం ప్రారంభించాయి.

"అదైనా యీ వాడలో కాబట్టి!—'' అనిక్షణ మాగి "యీ పెన్షన్ ఉద్యోగం కన్నా పి. యఫ్. ఉద్యోగాలేనయమేమో!'' అన్నాడు మొదటాయన.

"వాళ్ళ నడుగుతే ఇంకోలా అంటారు''

మడత కుర్చీలో వాడు మొదటిసారి మాటాడాడు.

"చూస్తే మనలాటివాళ్ళ బ్రతుకు కొసవరకు అద్దె కొంపలలోనే గడిచేటట్టున్నది" పేముకుర్చీ.

"మనబ్రతుక్కా అద్దెకొంపైనా ఉన్నది. అదీ లేనివాళ్ళ సంగతో" అన్నాడు ప్లీడరు గుమస్తా.

"ఆకాడికి మనకన్నా పల్లెటూళ్ళవాళ్ళే నయం. తినటానికి తిండిమాట ఎలాఉన్నా ప్రతివారికీ ఉండటానికో ఇల్లంటూ ఉంటుంది." పేముకుర్చీ.

"పూరిపాకలు మనమూ వేసుకోవచ్చు. మన కుండటానికి నామోషీగాని" కర్రకుర్చీలో యూనివర్సిటీ అబ్బాయికూడా మాట కలిపాడు.

"వేసుకచూస్తే తెలుస్తుంది. మర్నాటికి మునిసిపాలిటీవారు సిద్ధం." ప్లీడరుగుమస్తా!

"ఊర్లో ఉన్న పాకలన్నీ ఏమిటి?"

"వెళ్ళి అడగండి వాళ్ళు ఎందరినోళ్ళు ఎలా మూస్తున్నారో తెలుస్తుంది?"

"ఏం? పాక వేసుకుంటే మునిసిపాలిటీ వారి కభ్యంతర మేమిటి?". పేముకుర్చీ ఆయన అడిగాడు.

"మీ పాక అంటుకుంటే మామేడ కాలిపోతుంది" మడతకుర్చీ ఆయన చెప్పాడు.

"అది చాలా అన్యాయం."

"మీరు స్వయంగా మేడకట్టిననాడనండి" ప్లీడరుగుమాస్తా.

"మీరు మేడకట్టరాదని నేనంటే"

"అనడం అందరం అంటాం. ఆక్షలు కొందరే చేస్తారు" మడతకుర్చీఆయన జవాబిచ్చాడు.

యూనివర్సిటీలో చదివిన అబ్బాయి కొంతసేపు ఊరుకొని అడిగాడు.

"నాకు తెలియకడుగుతాను. మనుషులు మేడకట్టడం పురోగమన మంటారా లేక పాకలు కట్టడం పురోగమనమంటారా?"

"పదిమంది మేడదిగుతూఉంటే దిగుతున్నారంటాను.

పదిమంది మేడ ఎక్కుతూఉంటే ఎక్కుతున్నారంటాను.

నలుగురు దిగి నలభైమంది ఎక్కుతూ ఉంటే చూసిననాడు జనం ఎక్కుతున్నారనే అంటాను"

యూనివర్సిటీ అబ్బాయి ఓటమి నంగీకరించలేదు. నవ్వుతూ అన్నాడు.

"ఉపమానాలతో చేసే తర్కం ఎంతపనైనాచేస్తుంది. దానితో నందిని పందినీ చెయ్యవచ్చు. పందిని నందినీ చెయ్యవచ్చు"

"అవును నిర్గుణుడని తెలుసుకున్నాక కూడా కొందరు అవసరంకొద్దీ దేవుణ్ణి సగుణుణ్ణిగానే ఉంచితే మరికొందరు ఆ పందినే దేవుడనుకొని మొక్కం డని కూడా అంటూవుంటారు."

వాదం వివాదమౌతుందేమోనని పేముకుర్చీఆయన భయపడ్డాడు కాని కాలేదు. మడతకుర్చీఆయన మరికొంత సేపయాక అన్నాడు.

"జీవితావసరాలన్నింటికీ రేషనింగులు పెట్టని ప్రభుత్వాలు బియ్యం పంచదారల

వంటివాటికి మాత్రమే రేషనింగులు ఏల పెడతాయో తెలుసా."

"జనం చచ్చిపోతారు కాబట్టి." "పేము కుర్చీ.

"కావలసినవాళ్ళు ఎంత దాచుకున్నా పట్టుబడరు కాబట్టి"-ప్లీడరుగుమాస్తా.

"ప్రభుత్వాలు కూలుతాయని" యూని వర్సిటీ అబ్బాయి నవ్వుతూ అన్నాడు.

"కాదు. జనంలో చాలామందికి ఊర కుక్కల్లా బ్రతకటానికి అభ్యంతరంలేదు కాబట్టి"

ఆతరువాత అతడేమన్నా యింకెవరూ అతడి నోట నోరు పెట్టలేదు.

ఆనాడు ఎంద రెన్ని చెప్పినా నీలవేణమ్మ భోజనానికి లేవలేదు.

పీటలమీంచి లేస్తూనే వెళ్ళి పెరట్లో ఒక నులక మంచం పడేసుక పడుకుంది. ఎవరో వచ్చి—ఏమని అడిగితే ఒంట్లో బాగులే దంది. ఆమెకు తన పంకా భర్త వంకా బంధువులు ఆడవాళ్ళల్లో కొందరు వున్నారు. వాళ్ళు 'మేం చూసుకుంటాం నువ్వు పడుకో' అన్నారు. తీరా ఆడవాళ్ళ పంక్తిని భోజ నానికి లెమ్మంటే ఆమె ఏడుస్తున్నది.

శుభమా అని గృహప్రవేశమౌతూ ఏడవ రాదన్నారు. శుక్రవారంపూట నిండింట కంట తడిపెట్ట రాదన్నారు. పిల్ల బెగిలిపోతోంది చూసుకోమన్నారు. ఎవరెన్ని చెప్పినా ఆమె దుఃఖం ఆపుకోలేదు.

"ఆవిడగారంతే! మీరు పదండి!!" అని గదిమింది ఆడబడుచు - చుట్టూమూగిన ఆడవాళ్ళను.

నీలవేణమ్మ ప్రవర్తన చూస్తే చాలా మందికి చాలా కారణాలవల్ల ఎంతో కొంత కోపంవస్తుంది. ఒక్క పావన రామయ్యకు మాత్రం ఆమె ప్రవర్తనకు కోపంరాదు.

ఆమెతో రమారమి నలభై యేండ్లయి అతడు కాపురం చేస్తున్నాడు. మొదట్టి ఐదారేండ్లూ బాధ్యత గుర్తించలేని అజ్ఞా నంలో వాళ్ళే కొంతహాయి అనుభవించారో అంతే. ఆ తరువాత ఉద్యోగం మీద చెంబులూ గిన్నెలూ పేకేజీ డొక్కులూ ఇనుపసామానూ కుక్కికుక్కి మంచాలూ పెట్టె బళ్ళల్లో రైళ్ళల్లో బస్సుల్లో వేసు కొని వాళ్ళెన్నెన్ని ఊళ్ళు తిరిగారో వాళ్ళకే తెలియాలి.

చీకటి కొట్లలో పూరియిళ్ళల్లో పాడుపడ్డ కొంపల్లో ఒంటి ఒంటి గదుల్లో మురికిలో చీదరలో అద్దెల కిచ్చిన యజమానులతో అద్దెలకున్న పొరుగువాళ్ళతో అద్దెల వసూలు కొచ్చే ఆసాములతో వాళ్ళెన్నెన్ని పాట్లుపడ్డారో వాళ్ళకే తెలియాలి.

పురుళ్ళతో పుణ్యాహవాచనాలతో శాంతు లతో బాలీచాలని పాలకేడ్చే చంటిపిల్లల కింకపేడ్పులతో పాలడబ్బాలతో, జబ్బు గేదెల నీళ్ళపాలతో కంట్రోళ్ళతో బ్లాక్ మార్కెట్లతో ఉప్పుడు బియ్యాల స్టేండర్డ్ గుడ్డల రేషనింగ్‌లతో మందులతో పిల్లల కడుపుల బల్లలతో వాంతులతో భేదులతో అమ్మవార్లతో ఆటలమ్మలతో వాటితోనే ప్రయాణాలతో వారాలకొద్దీ జాగా రాలతో నెలాఖరులో చావులతో వాళ్ళెన్ని కష్టాలుపడ్డారో వాళ్ళకే తెలియాలి.

చుట్టాలు - చుట్టాల చుట్టాలు - చుట్టాల పెళ్ళిళ్ళు - వడుగులు - తమయింటి వియ్యాలవారు - తమ పిల్లల చదువులు - వాళ్ళ వడుగులు - వాళ్ళ పెళ్ళిళ్ళు - ఇన్నింటినీ తట్టుకున్నారు. తట్టుకున్నారంటే కడుపునీ కంటినీ కాలునీ-అన్నింటినీ కట్టు కొని తట్టుకొన్నారు.

కాని వాళ్ళు తట్టుకోలేనిది ఒక్కటే— కడుపుశోకం!

కడుపు శోకమేమీ క్రొత్తదికాదు. అది కడుపు శోకమని తమ్మ తాము నమ్మించు కుంటే వారు దానినికూడా తట్టుకునేవారు.

నాలుగోఏట మొట్టమొదట కడుపుశోకం రుచి చూపిన అమ్మాయిని తాను బాది బాది చంపేశానని అంటుంది నీలవేణమ్మ. మూడవఏట కడుపు బల్లతో పోయిన ఐదవ అబ్బాయి సరియైన మందులు సకాలంలో పడక చచ్చిపోయాడని ఆవిడ నమ్మకం. ఆఖరు పురిటికి తాను పిల్లను కనలేకపోతే ఆపరేషను చేసిన ఆసుపత్రివాళ్ళు ఆ పిల్ల వాణ్ణి కావాలని చంపేశారంటుంది. హైస్కూ యిత్ పడి సంధిలో పద్యాలు చదువుతూ చచ్చిపోయిన అబ్బాయిని మేష్టర్లు చంపేశా రంటుంది.

అందర్లోకీ పెద్దబ్బాయిని తా నెన్నడూ కొట్టకపోయినా 'పరీక్షలు! పరీక్షలు!! ఫస్ట్ క్లాస్! ఫస్ట్‌క్లాస్!!' అని హైరాన పెట్టి రాత్రిం బగళ్ళు కంటికి నిద్రా కడుపునిండా తిండీ లేకుండా చేసినభర్తే వాడికి చావు తెచ్చి పెట్టారంటుంది. చిట్టచివర పొట్ట చిచ్చుపెట్టి పోయిన మహాలక్ష్మిని కట్టుకొన్న మగడూ పట్టుకెళ్ళిన అత్తగారూ పొట్టను పెట్టుకున్నా రంటుంది.

పావన రామయ్యకు తక్కిన చావుల సంగతెలా ఉన్నా పెద్దబ్బాయి చావుకు కారణం తాను కాదని చెప్పుకోవడం సాధ్య మయ్యిందికాదు. అందుచేత తక్కిన ఆరోప ణలనుకూడా అతనికి కాదనే అవకాశం లేక పోయింది. అందుచేతే అతడు నీలవేణమ్మ ఏడుస్తూ ఉంటే ఆమె ఊరుకునే దాకా తానుకూడా నోరుమూసుకు ఊరుకుంటూ ఉంటాడు.

దీపాలు పెట్టాకగాని నీలవేణమ్మ శోక ముడిగి ఇంటిలోకి రాలేదు.

## 3

రైలుకు బయలుదేరిన సుబ్బారాయుణ్ణి అంపకం పెట్టడానికి పావనరామయ్య కూడా బయలుదేరేడు.

ఆ తెల్లవారుజామున కుప్పల నూర్పు లకు ముహూర్తం. అందుచేత త్రయోదశి నాడు పెళ్ళాం పిల్లలను పంపించే షరతుపై అత డొక్కడే బయలుదేరేడు.

---

● అయిదేళ్ళ కొడుకును వెంటబెట్టుకుని సుబ్బారావుగారు మేటినీ ఆటకి సినిమాకి బయల్దేరారు. ఆయన టిక్కెట్లు కొంటుండగా కొడుకు గట్టిగా కళ్ళు మూసుకున్నాడు. "నాన్నా : నన్ను లోపలికి నడిపించుకు తీసుకెళ్ళు."

"ఏం, కంట్లో ఏమన్నా పడిందా?" అని సుబ్బారావుగా రడిగారు,

"కాదు, లోపలికెళ్ళాక తడుముకోక్కర్లేకుండా సీట్లు కనిపిస్తాయి" అన్నాడు కొడుకు.

దశమివెన్నెల - తొలిజాము - మంచు వలచగా కురుస్తోంది. వాళ్ళు సిటీబస్ కోవరం జంక్షనుకేసి వడుస్తున్నారు.

"మొత్తానికి యిల్లే కొన్నావ్" అన్నాడు సుబ్బారాయుడు.

"ఆఁ. అప్పుకూడాచేసి."

ఆ యిల్లు కొనటంగురించి మూడునెలల క్రితం కొంత రభసఅయ్యింది.

ముప్ఫైఐదేళ్ళ టైపిస్టు కాపీయిస్టుగా పనిచేసిన పావనరామయ్యకు రిటైర్ అయ్యే నాటికి ప్రావిడెంటుఫండ్ మూడు వేల పైచిలుక్కు మొత్తమయ్యింది. ఎవడో ఏజంటు బలవంతాన కట్టించిన ఇన్సూరెన్సు బాపతు వేయి రూపాయలు వచ్చాయి. అందులో రెండువేలు కట్నం లాంఛనాలు పెట్టి ఒక వెయ్యి ఖర్చులతో పిల్లకు పెళ్ళి చేసేయమంది భార్య. వెయ్యి రూపాయిలు చేతఉంటే ఒక కాలునొచ్చినా చేయినొచ్చినా పనికివస్తాయని ఆవిడ ఉద్దేశం. పి. యు. సి రెండుసార్లుపోయి యిక చదవను నాన్నా అన్న కొడుక్కు మునసబుకోర్టులో గుమస్తా ఉద్యోగమయ్యింది. వాడి జీతమున్నా. చేయగలిగినంతకాలం భర్తచేసే జాబ్‌వర్కులతో నున్నా సంసారం వెళ్ళబుచ్చవచ్చని ఆవిడ భావం.

ఎంతమంది ఎన్నిచెప్పినా యిల్లే కొంటానన్నాడు పావన రామయ్య. అదీ మంచిదే. కట్నాలబజారులో కొడుక్కు ధర పెరుగుతుందన్నారు కొందరు.

పైవాళ్ళేమన్నా పావన రామయ్య మనసులో మాటేమిటో తనకు తెలుసనుకుంటాడు సుబ్బారాయుడు. కాని అప్పనేసరికి అతడు సహజంగానే భయపడ్డాడు.

"మళ్ళా అదొకటా!" అన్నాడు దాన్ని బయట పెడుతూ.

"మనకు కావలసిన లొకాలిటీలో మనకు కావలసినపాటి యిల్లు మనదగ్గరున్న దానితో రాదు మరి"

సుబ్బారాయుడు ఆలోచించి ఒకనిట్టూర్పు విడిచాడు.

"కాని ఎలా తీరుతుంది?"

"అదే నేనూ అనుకున్నాను. అంతగా తీరకపోతే తీరదనుకున్నాను మళ్ళా"

సుబ్బారాయుడు మరి కొంతసేపూరుకొని అడిగాడు.

"పిల్ల పెళ్ళి ఎలా చేస్తామనుకున్నావ్?"

"అది బ్రతికి బట్టకడితే అయింటిమీదే తేవాలి" అని. "—ఇంతకూ అది ఐదేళ్ళ తరవాతమాట" అన్నాడు పావన రామయ్య.

చాలాదూరం ఆలోచించి అవును మరి అనుకున్నాడు సుబ్బారాయుడు.

వాళ్ళు జంక్షనుకు చేరుకొని కాలాగిట్ల మీద కూర్చున్నారు. కూర్చున్నాక కూడా చాలాసేపటివరకూ ఇద్దరూ మౌనంగానే ఉండిపోయారు.ఆతరువాత పావన రామయ్య ఆరంభించాడు.

"అబ్బీ ఒకవిషయం నీతో చెప్పాలి. దావ ఏమిటి యిలా మాటాడుతున్నాడనుకోకు. నాకు మనసులో మాటలు సరిగా చెప్పడంరాదు. అయినా నువ్వు ప్రయత్నం చేస్తే సరిగా అర్ధంచేసుకోవచ్చు -" అని సరిగా సర్దుకు కూర్చొని చెప్పడం ఆరంభించాడు.

"నేను మొదట్లో అంటే చిన్నప్పుడు దేనిగురించీ ఏమీ ఆలోచించేవాణ్ణి కాదు.





ఏదో తింటున్నాం అంటే తింటున్నాం ఉంటున్నాం అంటే ఉంటున్నాం అన్నట్టుండే వాణ్ణి. తరువాత నలుగుర్నీ చూసి ఓహో బ్రతుకంటే యిదా అనుకున్నాను.

పుణ్యం పాపం పరలోకం గురించి అందరూ మాటాడేవారు. కాని అందరూ ఇహంకోసమే బ్రతుకుతారు.

ఈలోకంలో ఎవడు సాహసించి తన కొరక్రిందికి ఎంత లాక్కుంటే అంతే దక్కుడు. నావంతు నాకు న్యాయంగా వస్తుందంటే భ్రమ.

— అని తెలుసుకున్నాను.

కాని నా తెలివి నాకేమీ ఉపయోగపడలేదు. లాక్కోవడమెలాగో నాకు తెలుసు కాని లాక్కోవడానికి నాచేతులు. కాళ్ళూ పుణ్యపాపాల పేరా న్యాయా న్యాయాల పేరా కట్టేసి ఉన్నాయి. .నాగుండెంతా పిరికి మందుతో బలహీనమై పోయి ఉన్నది.

అందుచేత ఉన్నంతలో వెసులుబాటు చేసుకుంటూ ఎవ్వరూ చూడనప్పుడు ఏ కొంచెం దొరికితే ఆ కొంచెమే సంగ్రహిస్తూ ఏదోవిధంగా బ్రతుక్కుంటూ వచ్చాను.

ఆరోజుల్లోని నాగురించి నేను జ్ఞాపకం తెచ్చుకుంటే నా కిలా అనిపిస్తుంది.

నాకా ఉద్యోగం తప్ప చేతనయ్యింది యింకేమీలేదు. ప్రాణంపోయినాఫరవాలేదు. ఉద్యోగం ఊడుతుందంటే మాత్రం ఉపద్రమైన హడలు. దారిద్ర్యాన్ని భరించడానికి నేను సిద్ధం. గౌరవం దెబ్బ తింటుందంటే చచ్చినంత భయం.

అందుచేతే గతీ మతీ లేని ఆ బ్రతుకు అలా సాగించడం తప్ప నాకు మరోమార్గం లేకపోయింది. భారతదేశంలో నూటికితొంభై మంది ఉద్యోగాలు చెయ్యకండానే బ్రతుకగలుగుతున్నారనే విషయం ఒక్కనాడు తట్టలేదు. కనీసం తులం బంగారంగాని సెంటు భూమిగాని చేరెడు ఇల్లుగాని ఉంటే నేనాడు మరీ అంత పిరికి బ్రతుకు బ్రతికి ఉండనక్కరలేదని ఆరోజుల్లో నేను తరుచు అనుకునేవాణ్ణి.

నా బ్రతుకుయొక్క- బండారం మా పెద్దవాడు పోయాక మరీ స్పష్టమయ్యింది. వాడు పొయ్యాక నే నెన్నోరోజులు అదేపనిగా ఆలోచిస్తూ ఉండేవాణ్ణి.

వాడు నా కడుపున పుట్టి ఎన్నడూ ఏసుఖమూ అనుభవించలేదు. తిట్లూ చీవాట్లూ కసుర్లూ దెబ్బలూ తప్ప ఒక అచ్చటా ముచ్చటా ఎన్నడూ ఎరగడు. ఎందువల్ల అని ఆలోచించాను.

నా పేదతనం కొంతవరకూ కారణం. కాని అదిఒక్కటేకాదు. నా ముసలితనానికి నేను వాడిపై ఆధారపడి ఉన్నాను. అందుకే వాడి లేత బ్రతుకుమీద వాడు మోయలేని భారాన్ని మోపి వాడి నూరేళ్ళ బ్రతుకూ బండలుచేశాను.

నేను ఎప్పుడేది చేసినా వాడిమేలును కోరి ఏదీ చేయలేదు. వాడికి చెప్పే నీతులు వాడి భవిష్యత్తును దృష్టిలోపెట్టుకొనికాక నా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చెప్పాను. వాడికి చెప్పించిన చదువంతా నాకోసమే చెప్పించుకున్నాను. బ్రతికిఉంటే వాడికి పెండ్లి నా శ్రేయస్సును దృష్టిలోఉంచుకొనేచేసేవాణ్ణి. వాడుపిల్లలుకంటే దానివల్ల కలిగే ఆనందం. ఆనందంలేమీ నా శ్రేయస్సునుబట్టే తేలిఉండేవి. కనుక్కున్న పిల్లలకూ కన్న తల్లి దండ్రులకూ కల

సంబంధం యీ విధంగా కనిపించిననాడు నా గుండె బేజారైపోయింది."

పావన రామయ్య ఆగిపోయాడు. సుబ్బారాయుడికి అతని గుండె చిచ్చుతీరుచూస్తే గుండెలు నీరు నీరౌతున్నాయి. పావన రామయ్య మరికొంతసేపు ఊరుకొని అరంభించాడు.

"నేననుకుంటాను - నాకు జీవితంలో ఆదినుండీ భరోసా. అన్నదిలేదు. అందు చేతే నేనిన్ని బాధలుపడి నా సంసారాన్ని బాధలుపెట్టి దానికోసం మళ్లా నేను బాధలు పడుతూవచ్చాను. మనిషిలో సాహసానికైతేనేమి బ్రతుకులో ఆనందానికైతేనేమి మూలం భరోసా, అది లేనినాడు మనిషి జీవచ్ఛవంగా తప్ప మనిషిగా బ్రతకలేడు"

పావన రామయ్య మళ్లా ఆగిపోయాడు. సుబ్బారాయుడు అతనిమాటల వెనక అతడు ఈ అరవయ్యేళ్లూ బ్రతికిన బ్రతుకు నర్థం చేసుకుంటున్నాడు.

కురుస్తున్న పొగమంచు అంతకంతకు దట్టమౌతున్నట్టున్నది. కాస్తున్న వెన్నెలలు క్రమ క్రమంగా కాంతితగ్గుతున్నట్టున్నాయి. దూరాన్నీ హెడ్‌లైట్లు ఎటో ఎటో కదులుతున్నాయి. పావన రామయ్య మళ్లా ప్రారంభించాడు.

"చెప్పవచ్చేదేమంటే నేనీ యిల్లు కొనడమా మానడమా అన్న ఆలోచనలో ఉన్నప్పుడు ఒక నిశ్చయానికి రావడం చాలా కష్టమయ్యింది. 'ఆ డబ్బుపెట్టి పిల్ల పెళ్లి చేసేస్తే'నో అని ఆలోచించినప్పుడల్లా నా గుండెలు దడదడలాడేవి. కాళ్ళక్రింద భూమి అందకండా పాతాళానికి జారిపోతున్నట్టనిపించేది. చివరికి ఇలాఅనుకొన్నాను. ఈ యిల్లు కొనడమొక్కటే నేను నా జీవితంలో ఆడగల జూదం. ఇది కొంటే నేను నా ముసలితనాన్ని ధైర్యంగా ఎదుర్కోవచ్చు. అదృష్టం బాగుండి దక్కించుకోగలిగితే నా పిల్లలు నాకన్న అదృష్టవంతులవగలరు. దక్కించుకోలేక పోవడానికి చాలాకాలం పడుతుంది. ఈలోగా దేవుడు హాని చేయకపోతే నేను కన్ను మూసేయక పోను."

—పాపం! అనుకోలేదు. సుబ్బారాయుడు. ఏమనుకోవటానికి అతనికి టైము లేదు. అతన్ని బస్సెక్కించి అది వెళ్ళాక పావన రామయ్య యింటిముఖం పట్టాడు.

పావనరామయ్యకు ఎంత కాదనుకున్నా అరవైయేళ్ళుంటాయి. వెన్నెల ఉన్నప్పటికీ దారి మరీ కొత్తది. అందుచేత అతడు ఆ రోడ్డున చీకట్లోనడుస్తున్నట్టు నడుస్తున్నాడు.

పావనరామయ్య క్రొత్తగా కొనుక్కున్న యింటికి దీపాలు లేవు. అవి వేయించేసరికి ఎన్నాళ్లు పడుతుందో తెలియదు. డబ్బెక్కడ వెతకడమన్న ప్రశ్న ఎదురైనప్పుడల్లా దాని నతడు జోరీగను తోలినట్టు తోలుతున్నాడు. మనిషి వీధి చివర చీకట్లో చీకటిగా ఉన్న యింటికేసి నడుస్తున్నాడు.

ఆ కాలనీలో క్రొత్తగా లేచిన భవనాల్లో చాలావాటికి నిర్మాణం పూర్తికాకముందే దీపాలు పడ్డవి. కాని వెచ్చదనం కోసం వాటి తలుపులన్నీ మూసిఉన్నవి. ఇళ్ళల్లో బంధించిన వెలుతురుతో వీధుల్లో విహరించే చీకటితో ఊరికిఉత్తరాన వేస్తున్న ఆ క్రొత్తవాడ కలకల్లాడుతూ కనిపించే కన్నెపిల్లలా కాకుండా కాలంలో వైధవ్యం దాపురించిన కాంతలా ఉన్నది. □□□





# పఠాభి పన్చాంగము

## ఏప్రిల్

1. ప్రభుత్వానికి పాలసీలు సున్న
   పాలసీలుండేది భీమా సంస్థలోమటుకే

2. పాకిస్తాను వప్పుకోబట్టి బంగాళం
   పంచబంగాళమయింది

3. నరలోకమునకు
   'క'ప్రత్యయంచేరుటవల్ల
   నరకలోకం ఏర్పడుతుంది
   అంతేగాని వేరే నరకలోకంలేదు

4. జారత్వం ఎక్కువై వానిజన్మ
   బ్రతిమించి రోగానపడింది

5. భావకవిని కాను.
   అహంభావకవిని నేను

6. ఆర్ధికచింత ఎక్కువగనుకనే
   మనదేశంలో
   పారమార్థికచింతన ఎక్కువ

7. రాగమువల్ల ప్రణయము
   విరాగమువల్ల ప్రణవము

8. వనిత చక్కదనం
   వంపులోవుంది

9. ఉద్యోగ్యం పురుషలక్షణం
   నిరుద్యోగం మహాపురుషలక్షణం

10. నీతులూ గీతులూ. వీనిలోనాకు
    గీతులే యిష్టం

11. ఈనాడు థర్డుక్లాసు కంపార్టుమెంట్లో
    సామాన్లతో ప్రయాణంచేయుట
    ఇరుకులో సరుకు

12. రామాయణంకన్నా పాప్యులర్
    లోకాభిరామాయణం

13. తలంబ్రాలు కాదు.
    అది తలన్ బ్రాలు

14. దంతికన్నా వదంతి పెద్దది

15. హాయిహీల్డు బూట్సు వేయుటవల్ల
    కొందరు కన్యలకు కులుకు
    మరి కొందరికి లుకలుకు

16. ఆఆలువచ్చాక అతగాడు
    కాగుణింతమగు
    కొక్కోకం నేర్చుకుంటున్నాడిప్పుడు